సరే-చాకలిపద్దు అనగా విషయసూచిక పూర్తయిందనుకుంటాను.

ఏవన్నా మర్చిపోయానా?

ఆ అన్నట్లు... టోపీల సంగతి వ్రాయడం మర్చిపోయాను, స్వెట్టర్లని దేనితో పోల్చాను? క్రీడాలోకాన్ని స్వెట్టర్లతోనూ, సాక్స్ తోను పోల్చవచ్చు. నాకిష్టమైన నారీలోకాన్ని - టోపీతో పోల్చటం సబబుకాదు. టోపీతో పోల్చదానికి ఒకే ఒక శీర్షిక వుంది. అది ఉత్తరాల శీర్షికా, ప్రశ్నోత్తరాల శీర్షికా - ఏదైతే బావుంటుందో మీరే చెప్పాలి.

వ్యాపార ప్రకటనలను టోపీలతో పోల్చాలనీ ఉత్తరాలు - ప్రశ్నోత్తరాలను తలపాగాలు, కండువాలతో పోలిస్తే చాలని అభిజ్ఞ వర్గాల వారంటున్నారు.

పుస్తక సమీక్ష నెక్‌టై లాటిదట, పీకకు వురిత్రాడు ఆడదానికి పుస్తెల తాడులా - పుస్తక సమీక్ష మంగళ ప్రదమైనదీ - పుస్తకం తరువాత ఇంట్లోంచి పారిపోయేది వనితయె గదా; (పారిపోవడ మనగా మొగుడితో అత్తారింటికి కట్నందబ్బుల్నుచ్చుగుని లేచిపోవడం అన్నమాట) ఇంకా ఏవన్నా మర్చిపోయానేమో నా విషయసూచికలో -

ఏదో కిళ్లీలో మిఠాయి ఎక్కువేసినట్లు కాఫీలో రెండు చెంచాల పంచదార ఎక్కువైనట్లు, అనిపిస్తె మొహం చిట్లించుకోకండి.

గ్లాసుడు తేనె మీ కిష్టమా, కప్పు కాఫీ యిష్టమా - అంటే కప్పు కాఫీయే కావాలంటారు మీరు, నాకు తెల్సు.

మీ ముందు ఒక బాటిల్ తేనె సీసా వుంచాను.

అది రుచా అధరామృతం రుచా - ఇంటి కెళ్ళి గృహ రాక్షసి నడిగి ఏది కావలిస్తే అదే అడిగి పుచ్చుకోండి.

నవారుతో పోల్చదగినదేది?

పత్రికలో తేదీ, పేరు, పేజీ నెంబరు నవారు కాకపోతే మరేటోయ్ ఫ్రెండూ.

ఈ విషయసూచిక ఇలా మక్కికి మక్కి కంఠతా పట్టారంటే పిచ్చాసుపత్రికేనా పంపిస్తారు. నెత్తిన మేకు కొట్టి పూలదండేనా చుడతారు ప్రజలు; (అయ్యో లాల్చిసంగతి మర్చిపోయాను ఇష్)

# లంకలో సీత

ఎప్పుడూ శ్రీరామా అంటూ లంకలో సీత -
మసిపాత కట్టిన మాణిక్యంలా,
నివురుగప్పిన నిప్పులా,
కసుగందిన కుసుమంలా,

శీతాకాలంనాటి ఉదకంలా,
మేఘాలలోని సూర్యునిలా,
మెరుగుచెడిన అద్దంలా,
పాడ్యమినాడు చదివిన వేదంలా

రాహుగ్రస్తమయిన చంద్రమండలంలా చింతచేత కళలు తగ్గి వుంటుందిట! ఆవిడ నీలంపు కురులు విరబోసుకున్నా, జడలు ఎవరో వేసినట్లుందట. దేవి - తలంటు ఆడకే ఆడినట్లుండు. పచ్చిపసుపు రాసుకోకపోయినా ఒక చాయ బంగారు అలదినట్లుందట. పెట్టక కాటుక పెట్టినటులుండు. దిద్దక తిలకము దిద్దినటులుండు. సింగారించు కున్నట్లే వుంటుందట.

రాముడ్ని వదలి వున్న సీత సింగారించుకోదు. సింగారించుకోకపోయినా ఆమె వన్నెవాసి తరగదు. ఈ సంగతి వినుమా హనుమా అని హనుమంతుడికి నొక్కి చెబుతున్నాడు జానకీరమణుడు. ఇంకా అలదక పరిమలములలదినటులుండు వేయక తాంబూలము వేసినటులుండు. కాంతతొడుగులు తొడగకే తొడగి నట్లుండును - ఇన్నిచెప్పి - సీత "తొలకరి మెరుపువలె తావెల్గుచుండు" అని వర్ణన పూర్తి చేశాడు శ్రీరామచంద్రమూర్తి.

(ఈ ఉంగరం పట్టికెళ్ళి మరారాక్షసి ముండ కెవర్తికేనా యివ్వకుండా లంకలో వున్న సీతను పోల్చుకోవటానికి ఏడెనిమిది కాలాలకు ఓపేజీకి సరిపడే మేటరు హనుమంతుడికి యిస్తాడు శ్రీరామచంద్రమూర్తి)

దుఃఖంలో వున్న భర్త - ఒక ఘోటక బ్రహ్మచారి ఎదుట నిజభార్య సుగుణాలను అందచందాలను, ఆమెతోడి జ్ఞాపకాలను మనసువిప్పి ఆడదంటే తెలియదని గోల పెడుతున్న వారి దగ్గర తన ప్రయివేటు సంగతులు సైతం ఏకరువు పెట్టాల్సివచ్చింది.

సుదతుల రూపమ్ము చూచి నే నెరుగ
శ్రీకాంత రూపమ్ము మాకు ఎరిగించి
అతివ మెచ్చేటట్లు ఆనవాలిమ్ము అని

సీతమ్మవారి ఐడింటిఫికేషన్ మార్కు అడిగాడు ఆంజనేయులు, ఈ రోజుల్లో అయితే కనబడుటలేదు అని పేపర్లో వేస్తే పోలీసు రిపోర్టిస్తే సవాలక్షమంది ఆంజనేయుళ్లు వెతుక్కుని ఎంతమందినో సీతల్ని లాక్కొచ్చి రాముని కాళ్ళముందు కట్టి పడేసేవారు. ఒకఫోటో యిచ్చి కేరాఫ్ రావణాసురుడు లంక అని ఫోను నంబరిచ్చేస్తే సీతమ్మ చహరా బైటపడ్తుంది.

సీతాదేవిది లోకాతీతమైనటువంటి సౌందర్యం. అటువంటి సౌందర్యాన్ని వూహించుకుంటూ తనకు తెలిసిన సీతాదేవిడిటైల్సు ముందుచెప్పి లంకలో దురవస్థలో నున్న సీత ఎలావుంటుందో చెప్పాడు సీతారామచంద్రమూర్తి.

సీతారాములంటే నాకు చాలా ఇష్టం; దుఃఖాల్లోకల్లా గొప్ప దుఃఖం భార్యా వియోగం -

మగవాడన్నవాడికి పెళ్ళాన్ని పరాయివాడు వచ్చి ఎత్తుకుపోతే, కలిగే వియోగాన్ని మించిన దుఃఖం మరిలేదు.

అటువంటి దుఃఖాన్ని అనుభవిస్తూ "హా సీతా" అంటూ సామాన్యునివలె ఎలుగెత్తి వాపోయాడు శ్రీజానకీ రమణుడు. రామాయణంలోని విషాదమంతా సీతారాముల ఆకల్పాంత వియోగ దుఃఖమేకదా; పెళ్ళాం కోసం మనిషిలా గుండెలు అవిసేలా ఏడ్చినవాడు కనుక శ్రీరాముడంటే నాకు అపరిమితమైన గౌరవం, అభిమానం. ప్రేమా మరేదో - యింకేదో... లంకలో సీత రాక్షస మాయనుకుని "కోతిముండా కొడుకు యాక్షన్సు" నమ్మకపోవచ్చు.

"ఈవయ్యముద్రికా యింతి చేతికిని" అని కొన్ని సెన్సారు కాబడదగిన రీల్సుకి పనికివచ్చే ఆనవాళ్ళు చెబుతాడు దశరథరాముడు - సీతా రామాంజనేయులికి మచ్చుకి -

ఉంగరం ఒక ఆనవాలు

రైటో - రెండు.

కళ్యాణ మంటపంలో సీత వామనగుంట లాడుతూండగా చూడాలనే తలంపువచ్చి శ్రీరాముడు బయలుదేరి వచ్చాడట. రాముడ్ని చూసి తల్లి భూదేవి దగ్గరకు పారిపోయి సిగ్గుచే తలవంచుకొని నిలబడిందట:

అది ఒక ఆనవాలు.

మూడు

మిథిలా నగరంలో విల్లు విరచి సీతను పెండ్లాడిన తరువాత చిలకల మేడలో బంగారు తరిగోళ్ళ పట్టెమంచంమీద మొదటి రాత్రి - రెండు వైపులా తలగడలు వేసి పట్టు పచ్చడం పరచి దానిమీద విరజాజులు, బొడ్డుమల్లెలు, నీలాంబరాలు, తొడిమలు తీసిన పారిజాతాలు, చల్లారట. పదివేల భమిడి గవాక్షాల నడుమ ముత్యాల వీణలు మీటుతుండగా కోమలాంగులు తమ సన్నని నడుములు ఆసియాడగా అప్సరాస్త్రీలు ఆడగా, ఇది మహావైభోగ మెంత సోద్యమ్మో అంటూ పారిజాత పానుపు మీద పవ్వళించాట్ట రఘురాముడు. అప్పుడు సీతను తీసికొచ్చి వజ్రపు గడపల నడుమ నిలిపి బంగారు తలుపులకు తాళములువేసి కిలకిలా నవ్వుతూ వెళ్ళిపోయారట పడతులు.

అప్పుడు సిగ్గుపడుతూ నుంచున్న సీతాదేవిని చేరదీసుకోవడం కోసం వేలిఉంగరం తీసి ఆడుతూ ఎగరేసి తెమ్మన్నాడట. అప్పుడు సీతమ్మ కొంచెం ఒంగిందట. ముద్దుకుచముల నడుమ ముత్యాలహారాలు, అలివేణివీపునాకొప్పుజారగను. పాలత పాపిటజార బొట్టు తూలంగా, గాజులు భిన్నస్వనములు చేయగా, వంగి వుంగరం తీసుకుని పద్మనాభుల పాన్పు దగ్గరికిచేరి- ఇంకే ముంది? మారు ముఖం చేసుకుని చేయి జాపీ యివ్వగా చేయి పట్టుకుని శ్రీదేవి నెత్తియో తొడలపై నుంచి మహా సుఖంబున నిద్రిస్తిమయ్యా! అని ఒక ఆనవాలు హనుమంతుడికి చెప్పాడు.

(తరువాత జనమంతా ఈ స్టైయిల్ కాపీ కొట్టారనుకోండి రామ రాజ్యంలో)

మరో రోజు ముచ్చట - పరమ సీక్రెటు - నంబరు నాలుగు.

ఏడు నిలువుల కనకపు మేడలోపల ఎవ్వరూ యెరుగని ఏకాంతమందు శ్రీ దేవినెత్తి యా

తొడలపై నుంచి - కురులువిప్పి జవ్వాది, కస్తూరి అలది జడలువేసి బొట్టుపెట్టి - ఆవిడను శృంగార భక్తురాలిగాచేసి - వేడికాగుల వేన్నీళ్ళు తోడి - భమిడికాగుల చన్నీళ్ళు తోడి - తొరిసి - ముత్యాల పీట వేసుకుని సీతారాములు మజ్జన మాడిరట - అలా జలకాలాడిన పిదప సకలాభరణ భూషితురాలయి శృంగారములు వొలికిస్తూ వయ్యారి నడకలా పైట జారగను వారచూపులు చూస్తూ వచ్చిందట. సీత ఆవిడను అల్లంత దూరాన్నుంచే చూసి తలుపుగడియ వేసుకున్నాడట.

శ్రీరామచంద్రుడా తీవయ్య గడియా - అంటూ ధవళాయతాక్షి ముద్దుమాటలు విని మురవైరి రాముడు ముత్యాల గడియనెత్తి ముదితకు తీసెను తలుపు. మళ్ళీ శ్రీ దేవిని ఎత్తి వాళ్ళోకి తీసుకుని మహా సుఖమున నిద్రిస్తిమయ్యా అని యిది ఒక ఆనవాలని చెప్పు హనుమా అంటాడు సీతాపతి.

హనుమంతుడ్ని అల్లరిలో పడెయ్యటం కాకపోతే యిటువంటి పరమ ఇంపార్టెంటు ప్రయివేటు సంగతులు - సీక్రెట్లు - హనుమంతుడు సీతమ్మతల్లి ఎదుట చెప్పగలడా - చెప్పి వుండడు. రామదాసు అంటూ వుండడం విని తనుకూడా భక్త్యావేశంలో చెట్టుమీద భజనచేస్తూ కూర్చుని వుంటాడు.

సీతారాములవంటి వియోగ దంపతుల మధ్య ఒక బ్రహ్మచారికి అందులో వానర శ్రేష్ఠుడికి రాయబారం జరపడం చాలా రిస్కీ జాబ్;

ఇలా ఆనవాళ్ళు సరసశృంగార వేద్యంగా చెప్పుకు పోయారు.

అన్నీ యిక్కడ చెప్పలేను. అవి ఎంత బావుంటాయో మచ్చుకి చెప్పేను. అంతే -

మీకు రాముడంటే ఇష్టమా కృష్ణుడంటే యిష్టమా అంటే నా ఓటు రాముడికే వేస్తాను.

శ్రీకృష్ణుని పెళ్ళాల్ని అతను బ్రతికుండగా ఎత్తుకుపోలేరు. ఆ వియోగదుఃఖం అతన్ని ప్రేమించిన వాళ్ళు వలచి వచ్చినవాళ్ళు అనుభవించారేమో, కాని అతడు పైలా పచ్చీసుగా బతికాడంటాన్నేను

నాకు తెలీక - శ్రీకృష్ణుడంటె రవుడీ టక్కరి. ముండలముఠాకోరు, పొలిటీషియన్ అనుకునే దాన్ని.

ఆడపిల్లలకి మెజారిటీకి కృష్ణుడంటేనే యిష్టం.

నాకు తెలుగువారి ఇలవేల్పు - శ్రీరాముడంటే వున్న గౌరవం ఏకొండమీద వాడన్నాలేదు.

బిజినెస్‌మన్నీ, శిశుహంతకుల్నీ నరహంతకుల్నీ ఎలానైతే ప్రేమించలేమో-కొందరు దేవుళ్ళనుకూడా వాళ్ళెంత కొండమీది వాళ్ళైనప్పటికీ ఎన్ని విగ్గుల ఫ్యాక్టరీలున్నప్పటికీ - ఎంతమంది మినిష్టర్లు జై కొట్టినప్పటికీ చుట్టూ ఎంత అవినీతి పేరుకొన్నప్పటికీ లెక్కచెయ్యని వాళ్ళని భక్తితో గౌరవించలేం;

మనుష్యులంటే డబ్బులాక్కుని పరమ నీచంగాచూసి కాలితో తన్ని మెడపట్టుకుత్రోసి క్యూలో చంపే దేవుళ్ళంటే నాకు పరమ ద్వేషం;

అయితే మీకు త్యాగరాజ కీర్తనలు యిష్టమా? రామదాసు కీర్తనలు యిష్టమా? భక్తిరంజని వింటారా? వివిధ భారతి వింటారా?

ఇంతకీ మీ ఓటు రాముడికా కృష్ణుడికా -

# ఐ డోంట్నో

పెళ్ళాం చచ్చిపోతే.

అసలు చావగానే ఆడదాని చాప్టర్ క్లోజ్; మహా అయితే ఒక ఎన్లార్జిమెంటు తీయించి దానికో చెమ్కీ పూలదండవేసి. మెయిన్‌గేటు గుమ్మంమీద వేలాడకడ్తారు. ఇంట్లోకి రాగానే రెండో పెళ్ళి పెళ్ళాం ఆ బొమ్మను చూసి జడుసుకుని చావడానికి.

పెళ్ళాం పోగానే - మంచాలు ఎండలో పడేసి నవారు చాకల్దాని కేస్తారు. పరుపులు చింపేసి, దూది ఏకించి మళ్లీక్రొత్త దిళ్ళూ, క్రొత్త పరుపులూ కుట్టించుకుంటారు.

దాని నగలేమన్నావుంటే- పిల్లలుంటే బ్యాంకులలో వేస్తారు. ఆడపిల్లలుంటే వాళ్ళకోసం అట్టేపెడతారు. లేకపోతే - చెరిపించి క్రొత్త పెళ్ళానికి క్రొంగొత్త నగలు చేయిస్తారు.

దానిచీరలు నలుగురూ కట్టుకుని చింపిప్రోగులెడతారు.

ఒకప్పుడు కొంగు కొంగు ముడివేసుకుని గడప దగ్గర పేర్లు చెప్పి తలవంచుకొని ముసిముసి నవ్వులు నవ్వుతూ ఇంట్లోకి వచ్చిన దీపం లాంటి పడుచుపిల్ల - గుటుక్కు మనగానే స్మృతిపథంలోంచి క్రమక్రమంగా తుడిచి పెట్టుకుపోతుంది.

ప్రేమ అనేదిలేదు అది సర్వాబద్ధమని ప్రతి మగవాడూ ఎప్పుడో ఒకప్పుడు ఋజువుచేస్తాడు. చచ్చి పోయిన పెళ్ళాన్ని తలచుకుంటూ జీవితాంతం ఏడుస్తూ కూర్చోడు ఏమొగాడూ, కాని షాజహాన్ అలా ఏడ్చాడు.

ఆ రసికసామ్రాట్టు దుఃఖం మంచువలె తెల్లనై ఘనీభవించిన చోటు - అశ్రువుల ప్రతిబింబం తాజ్ మహల్

కాలం చెక్కిలిపై పడిన కన్నీటిచుక్క అన్నాడు టాగూర్ -

అంటే అన్నాడు కానీ - ప్రతి పెళ్ళయిన ఆడపడుచు హృదయం లోనూ ఒక తాజ్‌మహల్- తాజ్‌మహల్ కోటిదీప్తులతో ప్రకాశిస్తూ వుంటుంది.

అయితే ఆ మందిర కవాటాల్ను తెరిపించే "కీ" ఈ కట్నాలూ ఆడపడుచు లాంఛనాలు వగైరాలు స్వీకరించి తాళికట్టిన పెద్దల చాటు మొగుళ్ళకు లభించదు.

ఆ ప్రేమ పొందినవాడు ధన్యుడు